క్లుప్తంగా

ఏలూరు వెళ్లి పింఛన్ అందజేత



కంకిపాడు: మండలంలోని ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన పలగాని కృష్ణకుమారి వితంతు పింఛను లబ్ధిదారురాలు. ఇటీవల ఏలూరులోని సోదరుడికి ఇంటికి వెళ్తూ ప్రమాదానికి గురయ్యారు. ప్రస్తుతం ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న వలంటీరు ఈడా శ్రీనివాసరావు సొంత ఖర్చులతో గురువారం ఏలూరు ప్రభుత్వాస్పత్రికి వెళ్లి పింఛను సొమ్ము రూ.2750 అందజేశారు. వలంటీరు శ్రీనివాసరావు సేవా దృక్పథాన్ని సచివాలయ సిబ్బంది, పలువురు గ్రామస్తులు అభినందించారు.

ఘనంగా శివపార్వతుల శాంతి కల్యాణం



పెనమలూరు: మండలంలోని కానూరు శివాలయంలో గురువారం నేరెళ్ల కుటుంబ సభ్యులు శ్రీ శివపార్వతులకు శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. నేరెళ్ల జ్ఞాన సత్యనారాయణ దంపతుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు స్వామివార్లకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం విశేష అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. స్వామివార్లకు శాంతి కల్యాణం, పూర్ణ చండీ హోమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. మధ్యాహ్నం దాదాపు నాలుగు వేల మంది భక్తులకు అన్నసమారాధన చేశారు.

ఆది దంపతులకు పవళింపు సేవ



కేసరపల్లి(గన్నవరం): కేసరపల్లిలోని శ్రీగంగా పార్వతి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో నాలుగు నెలలుగా జరుగుతున్న శాంతి కల్యాణ మహోత్సవాలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా వసంతోత్సవం, త్రిశూల స్నానం, పూర్ణాహుతి సమర్పణ చేశారు. సాయంత్రం ఆది దంపతులకు పవళింపు సేవ నిర్వహించారు. అనంతరం మహిళా భక్తులకు అమ్మవారి పసుపు, కుంకుమ, గాజులు అందజేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

వాటర్ డిస్పెన్సర్ వితరణ



గన్నవరం రూరల్: ముస్తాబాద సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్‌లో విద్యార్థినుల సౌకర్యార్థం వాటర్ డిస్పెన్సర్‌ను అమరావతి లేడీస్ సర్కిల్-206 ప్రతినిధులు గురువారం అందజేశారు. వేసవిలో బాలికలకు చల్లని నీరు అందించడానికి డిస్పెన్సర్ ఉపయోగపడుతుందని సర్కిల్ చైర్మన్ సీఆర్ అనిత్‌కౌర్ తెలిపారు. సర్కిల్ ప్రతినిధులు సింధు, స్వప్న పాల్గొన్నారు.

ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు

ఉంగుటూరు: మండలంలో పదో తరగతి పరీక్షల్లో గురువారం సెకండ్ లాంగ్వేజ్ ప్రశాంతంగా జరిగింది. ఆత్కూరు, తేలప్రోలు, ఉంగుటూరు, మానికొండ, ఇందుపల్లి జెడ్పీ హైస్కూల్స్, సెయింట్ జార్జి పెద అవుటపల్లి, గుడ్‌విన్ ఆత్కూరులోని పరీక్షా కేంద్రాల్లో మొత్తం 592 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 579మంది హాజరయ్యారు. 13 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ వెంకటేశ్వరరావు తెలిపారు.

ఉయ్యూరు మండలంలో..

ఉయ్యూరు: మండలంలో పదో తరగతి పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. రెండో పరీక్షగా హిందీ నిర్వహించారు. మండలంలోని ఏడు పరీక్ష కేంద్రాల్లో 1,278 మంది విద్యార్థులకు 1,266 మంది విద్యార్థులు హాజరయ్యారు. 12 మంది గైర్హాజరయ్యారు.

పంటల పరిశీలన



గన్నవరం రూరల్: మండలంలోని వెదురుపావులూరు రెవెన్యూ పరిధిలో అకాల వర్షాలకు దెబ్బతిన్న జొన్న, మొక్కజొన్న పంటలను గురువారం మండల వ్యవసాయాధికారి ఎస్ఎల్ తేజస్వి పరిశీలించారు. అకాల వర్షాలు, గాలులతో తమ పంటలకు నష్టం వాటిల్లిందని రైతులు వ్యవసాయ శాఖ దృష్టికి తేవడంతో కొల్లి శివారెడ్డి, సుబ్బారెడ్డి, దాసరి రాజు, మండవ రత్తయ్య పలువురు రైతుల పంటలను ఆమె పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 33 శాతం పంట నష్టం జరిగితే పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు.

వైద్య చరిత్రలో నూతన అధ్యాయం

- ఫ్యామిలీ డాక్టర్‌తో ప్రతి ఇంటికీ వైద్య సేవలు
- కృష్ణా కలెక్టర్ రంజిత్ బాషా



వణుకూరులో మందులు పంపిణీ చేస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా, ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



బండారుగూడెంలో..

పెనమలూరు: వైద్య చరిత్రలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం ఒక నూతన అధ్యాయం అని, దీని ద్వారా ప్రతి ఇంటికీ వైద్య సేవలు చేరుతాయని కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పల్నాడు జిల్లా లింగం గుంట్ల గ్రామంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని లాంఛనంగా ప్రారంభించిన అనంతరం వణుకూరు గ్రామంలో సచివాలయం-2 పరిధిలో ఉన్న డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్ వద్ద జిల్లా స్థాయిలో కలెక్టర్ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల్లో అందరికీ ఆధునిక వైద్యం అందించడానికి ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రారంభించిందన్నారు. వైద్యుడు, వైద్య సిబ్బంది గ్రామంలో ప్రతి ఇంటికీ వచ్చి వైద్య పరీక్షలు చేసి సేవలు అందిస్తారన్నారు. మంచానికి పరిమితమైన రోగులకు కూడా వైద్య పరీక్షలు చేసి మందులు ఇస్తారన్నారు. మెరుగైన వైద్యం అవసరమైతే ఆరోగ్యశ్రీ ఆస్పత్రులకు రిఫర్ కూడా చేస్తారన్నారు. జిల్లాలో 104 వాహనాలు 34 అందుబాటులో ఉన్నాయని, షెడ్యూల్ ప్రకారం వైద్యుడు, ఏఎన్ఎం, సిబ్బంది ఆయా గ్రామాలకు వస్తారన్నారు. గర్భిణులు, దీర్ఘకాలంగా వ్యాధులతో బాధ పడేవారిని ప్రత్యేకంగా పర్యవేక్షిస్తారని వివరించారు. ప్రభుత్వం ఎంతో సదుద్దేశంతో ఈ పథకం ప్రవేశ పెట్టిందని, వైద్య సిబ్బంది కూడా చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు.

వైద్యం, విద్యకు ప్రాధాన్యం..

జగనన్నపాలనలో వైద్యం, విద్యకు ప్రాధాన్యం ఇచ్చి సమాజంలో మార్పు తీసుకురావటానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. కుటుంబం ఆరోగ్యంగా ఉండటం, పిల్లలు ఉన్నత చదువులు చదువుకుంటేనే అట్టడుగు వర్గాలు అభివృద్ధి సాధిస్తాయన్నారు. గత చంద్రబాబు పాలనలో ఎంతో అభివృద్ధి చేశాడని డబ్బా కొట్టుకుంటున్నారని వాస్తవానికి విద్య- వైద్య రంగాన్ని నిర్వీర్యం చేసి పేదలను అనేక ఇబ్బందులకు గురి చేశాడని ఆరోపించారు. టీడీపీ పాలనలో లో 5 వేల మందికి ఒక్క ఏఎన్ఎం ఉండేవారని, ఇప్పుడు 2 వేల మందికి ఏఎన్ఎంలు ఉన్నారన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆరోగ్య ఉపకేంద్రాలు 2500, కొత్త ఆస్పత్రులు 3 వేలు నిర్మించామని చెప్పారు. ఆరోగ్య కేంద్రాల్లో 14 రకాల వైద్య పరీక్షలు, 105 రకాల మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆరోగ్యశ్రీకి ఇప్పటి వరకు ప్రభుత్వం రూ. 2300 కోట్లు ఖర్చు చేసిందన్నారు. జిల్లా వైద్యాధికారి గీతాబాయ్, ఆర్డీవో విజయ్‌కుమార్, తహసీల్దార్ టీవీ సతీష్, ఎంపీడీఓ సునితాశర్మ, వైద్యాధికారి రవికుమార్, కంకిపాడు జెడ్పీటీసీ సభ్యుడు బాకీబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు మద్దాలి రామచంద్రరావు, వల్లభనేని వెంకటేశ్వరరావు, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు, సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ నేత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బుద్దవరం(గన్నవరం): బుద్ధవరంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను పెద్దఅవుటపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి హిమబిందుతో కలిసి సర్పంచి బడుగు బాలమ్మ ప్రారంభించారు. వైద్య సిబ్బంది సీతారామయ్య, అనిత, రజిత, పావని, లక్ష్మీసుమంత తదితరులు పాల్గొన్నారు.

రామవరప్పాడు: ఎనికేపాడు కమ్యూనిటీ హాల్‌లో గురువారం ఫ్యామిలీ డాక్టర్‌ను గౌడ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మాదు శివరామకృష్ణ, ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ కాకర్లమూడి సువర్ణరాజు, సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు, కోనేరు సుబ్బారావు తదితరులు ప్రారంభించారు.

వైద్య శిబిరంలో రోగులకు 14 రకాల వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఎంపీటీసీ సభ్యులు రాచ మళ్ల రత్నకుమారి, గంగుల శ్రీనివాసరావు, వార్డు సభ్యులు రాచమళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గన్నవరం రూరల్: చనుపల్లివారిగూడెంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్ వద్ద సర్పంచ్ బుద్ధాల లక్ష్మీ ప్రసన్న ప్రారంభించారు. సీహెచ్‌ఓ సింధూర, ఆశ ఎల్.దేవకరుణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉంగుటూరు: మానికొండలో ఫ్యామిలీ క్లినిక్‌ను ఇందుపల్లి పీహెచ్‌సీ డాక్టర్ ప్రారంభించారు. ఎంపీడీవో శేషగిరిరావు, డాక్టర్ సుబ్బారావు, ఎంపీటీసీ ముత్తయ్య, సీహెచ్‌ఓ మౌనిక, ఏఎన్ఎం స్వప్న, ఆశావర్కర్లు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం బండారుగూడెంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. వీరవల్లి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఆధ్వర్యాన గ్రామంలోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని సర్పంచ్ వడ్లమూడి అమ్మాజీ ప్రారంభించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి కిరణ్మయి గ్రామంలో పలువురికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎంపీహెచ్‌ఈవో సీహెచ్ శ్రీనివాసరావు, పీహెచ్‌సీ సిబ్బంది సౌదామిని, మంగతాయరు, వరలక్ష్మి, ఏఎన్ఎం అనిత, వైఎస్సార్ సీపీ నేత వడ్లమూడి తిరుపతిరావు పాల్గొన్నారు.

వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సాయం



పెనమలూరు: వైఎస్సార్ తాడిగడప మునిసిపాలిటీ పరిధి పోరంకిలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి వైఎస్సార్ సీపీ ఆర్థిక సాయం అందించింది. గ్రామానికి చెందిన వక్కలగడ్డ విశ్వతేజకు రెండు కిడ్నీలు దెబ్బతిన్నాయి. వారానికి రెండు సార్లు డయాలసిస్ చేయించుకోవటం భారంగా మారింది. ఈ విషయం స్థానిక వైఎస్సార్ సీపీ నేతలు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి రూ.20 వేల ఆర్థిక సాయం ప్రకటించారు. పార్టీ గ్రామ కన్వీనర్ మున్నంగి అర్జున్ రెడ్డి, నేతలు బొర్రారామణయ్య, నల్లమోతు జీవన్, అద్దెపల్లి చందు, ఆకునూరు సుబ్బారావు, బండెల రాజు గురువారం బాధిత కుటుంబానికి రూ.20 వేలు అందచేశారు.

అఖిలాండేశ్వరికి నృత్య నీరాజనం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దర్మపథం కార్యక్రమంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో గురువారం పలువురు నృత్యకారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. విజయవాడకు చెందిన భారతి రాఘవ నృత్య కేంద్రానికి చెందిన నవ్యశ్రీ, సాత్విక, ఆరాధ్య, పూర్ణ, లహరి, యువశ్రీ, శరణ్యారి, దివ్య, కీర్తి, ఏక్షిత, హేమ, గగనలు పలు కీర్తనలకు నృత్యాలు ప్రదర్శించారు. అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం నిర్వహించిన ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలు అందించారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు భేష్



మహిళలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: 'రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు మాకు సకాలంలో అందుతున్నాయి. ప్రభుత్వం మంజూరు చేసిన సొమ్ము నేరుగా మా బ్యాంకు ఖాతాల్లో జమవుతోంది. ఎక్కడా అవినీతి జరగటం లేదు. ప్రభుత్వ పాలన, సంక్షేమ పథకాల అమలు భేష్' అని పెనమలూరు మండలం, కానూరుకు చెందిన తోట నాగవరలక్ష్మి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కానూరు సచివాలయం-3 పరిధిలో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి గురువారం పర్యటించారు. లబ్ధిదారులకు ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారిని సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ ఆసరా, ఇన్‌పుట్ సబ్సిడీ, వైఎస్సార్ సున్నా వడ్డీ, జగనన్న చేదోడు, వైఎస్సార్ రైతు భరోసా, వైఎస్సార్ పింఛన్ కానుక తదితర పథకాలను ప్రభుత్వం సకాలంలో అమలు చేస్తూ నేరుగా తమ బ్యాంకు ఖాతాలో సొమ్ము జమ చేస్తోందని లబ్ధిదారులు సంతోషం వ్యక్తంచేశారు. జగనన్న పాలనలో పేద, మధ్య తరగతి కుటుంబాలకు పూర్తి న్యాయం జరుగుతోందని స్పష్టంచేశారు. గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుపరిచి, దోమలను నివారించాలని కోరారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు..

జగనన్న పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. గత ప్రభుత్వం జన్మభూమి కమిటీలతో పేదలను చాలా ఇబ్బందులు పెట్టి సంక్షేమ పథకాలు అమలు చేయలేదని గుర్తుచేశారు. తమ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో తాడిగడప మునిసిపల్ కమిషనర్ ఎస్.ప్రకాశరావు, వైఎస్సార్ సీపీ నేతలు అన్నే శ్రావణ్‌కుమార్, వేమూరి బాలకృష్ణ, తాళ్ల నరేంద్ర, అంగిరకుల సీతారామయ్య, ఈదా రాజేష్, కటికల కృష్టోఫర్, సుబ్బరాజు,తుమ్మల వరదీష్, ఈదా రాజేష్, పిన్నబోయినరవి, తుమాటి శ్రీరాములు, షేక్ హాఫీజా తదితరులు పాల్గొన్నారు.

అంబాపురం అభివృద్ధికి కృషి



బహుమతులు అందజేస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ శేషగిరిరావు, సర్పంచ్ గండికోట సీతయ్య

రామవరప్పాడు: గ్రామ పంచాయతీలో నూరు శాతం పన్నులు వసూలు చేయడం అభినందనీయమని, గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని ఇన్‌చార్జి ఎంపీడీఓ శేషగిరిరావు తెలిపారు. ఇంటి పన్నులు నూరు శాతం వసూలు చేసిన సందర్భంగా రూరల్ మండలం అంబాపురం పంచాయతీ కార్యాలయంలో గురువారం సర్పంచ్ గండికోట సీతయ్య, పంచాయతీ కార్యదర్శి టి. భారతిని ఇన్‌చార్జి ఎంపీడీఓ బీఎల్వీ శేషగిరిరావు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పన్నులు వసూలు చేసిన సిబ్బందికి నగదు బహుమతి అందజేశారు. శేషగిరిరావు మాట్లాడుతూ పాత బాకీలతో పాటు ప్రస్తుత పన్నులు కూడా వసూలు చేసి పలు గ్రామాలకు స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు. సర్పంచ్ గండికోట సీతయ్య మాట్లాడుతూ గ్రామ ప్రజలు, పంచాయతీ కార్యదర్శి సహకారంతో నూరు శాతం పన్నులు వసూలు చేయగలిగామన్నారు. గ్రామాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. పాత బకాయిలతో కలిపి మొత్తం రూ 28,98,629 నూరు శాతం వసూలు చేసినట్లు తెలిపారు. వార్డు సభ్యులు యాడ్లపల్లి వసంత్ కుమార్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మలకు అండగా జగనన్న

పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



పెనమలూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి



సభకు హాజరైన అక్కచెల్లెమ్మలు

పెనమలూరు: అక్కచెల్లెమ్మలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉన్నారని పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. మండలంలోని గ్రామాలు, తాడిగడప మునిసిపాలిటీ పరిధిలో 2,096 గ్రూపులకు చెందిన 20,543 మంది సభ్యులకు ఆసరా మూడో విడతగా రూ.18.56 కోట్ల మేర లబ్ధి చేకూరింది. ఈ సందర్భంగా పెనమలూరు హైస్కూల్ సెంటర్‌లో గురువారం జరిగిన సభలో అక్కచెల్లెమ్మలకు ఎమ్మెల్యే పార్థసారథి చెక్కు పంపిణీ చేసి మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత నాలుగు విడతల్లో రుణాలు మాఫీ చేస్తానని ఇచ్చిన ఎన్నికల హామీ అమలు చేస్తున్నారని తెలిపారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు డ్వాక్రా మహిళల రుణాలు మాఫీ చేస్తానని హామీ ఇచ్చి, వారి ఓట్లతో గెలిచి మోసం చేశాడని గుర్తుచేశారు. రుణాలు మాఫీ జరుగుతాయని నమ్మిన డ్వాక్రా మహిళలు అప్పుల పాలయ్యారని పేర్కొన్నారు. పేదలు, మహిళల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే, ప్రతి పక్షాలు రాష్ట్రం మరో శ్రీలంకలా అవుతోందని ప్రచారం చేయడంపై మండిపడ్డారు. చంద్రబాబు పాలనలో బడాబాబులకు వందల ఎకరాలు ధారాదత్తం చేశారని గుర్తుచేశారు. నేడు పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తే గగ్గోలు పెడుతున్నాడని విమర్శించారు.

ప్రజలు వాస్తవాలు ఆలోచించాలి..

రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల పై ప్రజలు వాస్తవాలు గ్రహించాలని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి సూచించారు. పేదలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయటం తప్పా అని ప్రశ్నించారు. ప్రతి విషయంలో చంద్రబాబు, ఎల్లో మీడియా ప్రభుత్వంపై రాద్ధాంతం చేస్తున్నాయని దుయ్యబట్టారు. 14 సంవత్సరాలు సీఎంగా పని చేసిన చంద్రబాబు పేదలకు ఏం న్యాయం చేశాడో చెప్పాలని డిమాండ్ చేశారు. టీడీపీతో పోల్చుకుంటే తమ పాలనలో పెనమలూరు నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేశామని వివరించారు. ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, కంకిపాడు జెడ్పీటీసీ సభ్యుడు బాకీబాబు, సర్పంచులు కాకర్ల వెంకటరత్నం, లింగాల భాస్కరరావు, గుంటూరు శ్రీనివాసచౌదరి, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు పి.రాఘవరావు, ఈడే చాముండేశ్వరి, ఎంపీడీఓ సునితాశర్మ, ఏఓ లోయ శివశంకర్, ఏసీ ఈడ్పుగంటి రంగారావు, ఏపీఎం నాగభూషణం పాల్గొన్నారు.

నేర్చుకోవాలనే సంకల్పమే విజయానికి పునాది



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఉంగుటూరు: నేర్చుకోవాలనే సంకల్పం వృత్తిలోనూ, జీవితంలో విజయాలకు పునాది అని జేఎన్‌టీయూ నర్సరావుపేట ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావు అన్నారు. తేలప్రోలులోని ఉషారామ ఇంజినీరింగ్ కళాశాల 15వ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువ మార్కులు పొందినవారికంటే నేర్చుకునే గుణం ఉన్నవారినే పెద్ద సంస్థలు ఉద్యోగానికి ఎంపిక చేసుకుంటాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ బాగా చదువుకుని ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. కళాశాల చైర్మన్ సుంకర రాంబ్రహ్మం మాట్లాడుతూ విద్యార్థులను సంపూర్ణ వ్యక్తిత్వమున్న వృత్తి నిపుణులుగా తీర్చి దిద్దడానికి తమ కళాశాలలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ జీవీకేఎస్వీ ప్రసాద్ కళాశాల వార్షిక నివేదిక వివరించారు. టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులను గోల్డ్, సిల్వర్ మెడల్స్‌తో సత్కరించారు. కార్యక్రమంలో మణిపాల్ హాస్పటల్స్ డాక్టర్లు కృష్ణారెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

50 మంది ఇంజినీరింగ్ విద్యార్థుల రక్తదానం



కానూరులో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

పెనమలూరు: మండలంలోని కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు 50 మంది గురువారం రక్తదానం చేశారు. కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్, పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని డీన్ బావినేని పాండురంగారావు ప్రారంభించి ప్రసంగించారు. రక్తదానంతో ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడొచ్చని సూచించారు. ఆరు నెలలకు ఒక సారి రక్తదానం చేయొచ్చని పేర్కొన్నారు. తలసీమియాతో బాధ పడే వారికి రక్తం చాలా అవసరమన్నారు. డాక్టర్ కల్యాణ్‌చక్రవర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, సివిల్ అధ్యాపకుడు యు.వి. నారాయణ తదితరులు పాల్గొన్నారు.

లారీల నుంచి ఆశీలు వసూలు ఆపాలి



నో ఆశీలు పోస్టర్ ఆవిష్కరిస్తున్న లారీ ఓనర్స్ అసోసియేషన్ నేతలు

గన్నవరం: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు, హైకోర్టు తీర్పుకు అనుగుణంగా లారీల నుంచి ఆశీలు వసూలును నిలుపుచేయాలని ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు తుమ్మల లక్ష్మణస్వామి తెలిపారు. స్థానిక సంఘ కార్యాలయంలో గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. జీఓ నెం. 551 ప్రకారం లారీల నుంచి ఆశీలు వసూలు చేయవద్దని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. వీటిని సమర్థిస్తూ 2004లో హైకోర్టు తీర్పు కూడా ఇచ్చిందన్నారు. కింది స్థాయిలో అధికారులు అమలుచేయకపోవడంతో లారీ ఓనర్స్ ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ముఖ్యంగా గన్నవరం పంచాయతీలో ఆశీలు పాటదారులు లారీల నుంచి బలవంతంగా వసూళ్లకు పాల్పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైన ఆశీలు వసూళ్లను నిలిపివేయకపోతే మరోసారి న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు. అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపిశెట్టి వీరవెంకయ్య, నేతలు అన్నపురెడ్డి శివప్రసాద్‌రెడ్డి, వింత రవీంద్ర రెడ్డి, చెరుకూరి వేణుగోపాల్, శ్రీహరి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మానికి ప్రతిరూపం రాముడు

విజయవాడ కల్చరల్:మూర్తీభవించిన ధర్మానికి ప్రతిరూపం శ్రీ రామచంద్ర ప్రభువని ఆధ్యాత్మిక వేత్త గుడిపాటి జయరాం సుధాకర్ అన్నారు. శ్రీరామభక్త సేవా మండలి ఆధ్వర్యంలో గురువారం సత్యనారాయణపురం సీతారామమందిరంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా గుడిపాటి సుధాకర్ రామాయణంలో రమణీయత అంశంగా ప్రసంగం, సీతా కల్యాణం కథాగానం చేశారు. భారతీయుల ఆరాధ్యదైవం శ్రీ రామచంద్రుడుని, ఆయన జీవితం సర్వజనులకు ఆదర్శనీయమన్నారు.

భూ సర్వే పనులు వేగంగా చేయాలి

హనుమాన్‌జంక్షన్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకాన్ని క్షేత్రస్థాయిలో వేగంగా, సమర్థంగా నిర్వహించాలని గుడివాడ ఆర్డీఓ పి.పద్మావతి అన్నారు. మహాత్మాగాంధీనగర్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆమె వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లతో ఈ పథకంపై సమీక్షించారు. ఏఏ గ్రామాల్లో సర్వే పనులు జరుగుతున్నాయి, ఏ దశలో ఉన్నాయనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ బాపులపాడులో వైఎస్సార్ జగనన్న కాలనీ మొదటి లే అవుట్‌కు అప్రోచ్ రోడ్డు సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కారిస్తామని, దీనికోసం భూసేకరణ చేపట్టామని తెలిపారు. మల్లవల్లి ఏపీఐఐసీ పారిశ్రామికవాడ భూనిర్వాసితులకు నష్టపరిహారం మంజూరుపై ప్రభుత్వం ఇప్పటికే కలెక్టర్ నేతృత్వంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసిందని చెప్పారు. కానీ ఈ భూముల వ్యవహారంలో న్యాయ వివాదాలు ఉన్నాయని, వివిధ కోర్టుల్లో 23 రిట్ పిటిషన్లు ఉన్నాయని తెలిపారు.

గురు సంప్రదాయాన్ని పరిరక్షించుకోవాలి



వేదసభలు నిర్వహిస్తున్న పండితులు

విజయవాడ కల్చరల్: గురు సంప్రదాయం పరిరక్షించుకోవాలని, సద్గురువుల బాటలో పయనించాలని వేద పండితులు విష్ణుభొట్ల లక్ష్మీనారాయణ ఘనాపాటి సూచించారు. కృష్ణా మండల వేద విద్వత్వర్ధక సభ ఆధ్వర్యంలో సత్యనారాయణపురం బులుసు లలితామణి కల్యాణమండపంలో వేద పరీక్షల రెండవరోజు కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ విద్యార్థులు చిత్తశుద్ధి, ఏకాగ్రత, లక్ష్యం కలిగి ఉండాలని చెప్పారు. కష్టపడితే విజయం వరిస్తుందన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేదపండితులు గురువందనంతో ప్రారంభించి వేదపఠనం చేశారు. విష్ణుభొట్ల సుబ్రహ్మణ్య ఘనాపాటి ముఖ్య పరీక్ష అధికారిగా పర్యవేక్షించారు. కృష్ణామండల వేదవిద్వత్వర్ధక చైర్మన్ మాగంటి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ శుక్రవారం ఉదయం లబ్బీపేటశ్రీ శారదాచంద్రమౌళీశ్వర స్వామి దేవాలయంలో కంచికామకోటి పీఠాధిపతి శంకరవిజయేంద్ర సరస్వతి ఆధ్వర్యంలో పండిత సభ జరుగుతుందని తెలిపారు.

పరీక్షలకు కట్టుదిట్టమైన చర్యలు

కంకిపాడు(పెనమలూరు): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రెండో రోజూ ప్రశాంతంగా కొనసాగాయి. పరీక్షలను సమర్థంగా నిర్వహించేందుకు విద్యాశాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంది. పది పబ్లిక్ పరీక్షల్లో గురువారం హిందీ పరీక్షను నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 143 పరీక్ష కేంద్రాలకు నిర్ణీత సమయానికి విద్యార్థులు చేరుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 19,903 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా, 19,664 మంది పరీక్షలకు హాజరయ్యారు. 239 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

విస్తృతంగా తనిఖీలు..

పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా యంత్రాంగం అప్రమత్తంగా ఉంది. పరీక్ష కేంద్రాలను విస్తృతంగా తనిఖీలు చేస్తూ సిబ్బందికి సూచనలు ఇచ్చారు. డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ డి.దేవానందరెడ్డి కంకిపాడు మండలం ఈడుపుగల్లు, ఉయ్యూరు మండలం ఆకునూరు, ఉయ్యూరు పట్టణంలోని ఐదు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లోని వసతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచే శారు. జిల్లా కలెక్టర్‌రంజిత్ బాషా ఈడుపుగల్లు జెడ్పీ పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. డీఈఓ తాహెరా సుల్తానా ఎనిమిది పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు జిల్లాలో 30 పరీక్ష కేంద్రాలను పరిశీలించి పరీక్షల నిర్వహణను పర్యవేక్షించాయి.